క్లుప్తంగా

గృహసారథులకు బీమా



బీమా వివరాలు నమోదు చేస్తున్న పార్టీ నేతలు

సరుబుజ్జిలి: గృహసారథులు, కన్వీనర్లు, గ్రామ వలంటీర్ల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ తరఫున పూర్తిస్థాయిలో బీమా సౌకర్యం కల్పించడం గొప్ప విషయమని మండల ప్రత్యేకాహ్వానితుడు కె.వి.జి.సత్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ అత్తులూరి రవికాంత్ తెలిపారు. సోమవారం పురుషోత్తపురం గ్రామ సచివాలయంలో బీమా నమోదు కార్యక్రమం నిర్వహించారు. బీమా ప్రీమియమ్ పార్టీ తరఫున చెల్లించి ప్రతీ ఒక్కరి జీవితానికి భద్రత కల్పించనున్నట్లు వెల్లడించారు.

160 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తు వైద్య సిబ్బంది

నరసన్నపేట: మండలంలోని తెలగవలసలో జ్వరాలు తీవ్రత అధికంగా ఉండటంతో సైరగాం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది డాక్టర్ పొన్నాన గురుమూర్తి ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆరంగి సూర్యనారాయణ ప్రారంభించారు. వైద్య శిబిరంలో 160 మందికి రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుతోపాటు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గ్రామాలలో అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు తదితర కార్యాలయాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



అక్రమణ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బూర్జ: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎస్.రమణారావు హెచ్చరించారు. మండలంలోని కంట్లాం పంచాయతీ లచ్చయ్యపేట గ్రామంలో జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని టంకాల గణపతిరావు ఆక్రమించి షెడ్లు వేశాడు. సోమవారం స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ వచ్చి నిలుపుదల చేశారు. అక్కడ నుంచి తహసీల్దార్ వెళ్లిన తరువాత మళ్లీ షెడ్లు వేయడం ప్రారంభించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

పెద్దలంకాం సర్పంచ్‌కు సన్మానం



సర్పంచ్ గోవిందరావును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బూర్జ: మండలంలోని పెద్దలంకాం సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన కాగితాపల్లి గోవిందరావును మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సోమవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీ కరణం కృష్ణమూర్తి నాయుడు, బూర్జ సర్పంచ్ ఏగు అనురాధ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

నేడు మహాశింగిలో గడపగడపకు మన ప్రభుత్వం

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం సచివాలయం పరిధిలోని మహాశింగి పంచాయతీలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

పేదల జీవితాల్లో వెలుగులు



సారవకోట: ధర్మలక్ష్మీపురంలో సంక్షేమ పథకాల లబ్ధి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



ఆమదాలవలస రూరల్: లొద్దలపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

ఆమదాలవలస రూరల్: పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థతో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో లొద్దలపేట, బెలమాం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సాంకేతికపరమైన కారణాలతో అర్హులైన లబ్ధిదారులు సంక్షేమానికి దూరం కాకుండా చూడాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. సచివాలయ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ..అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కణుగుల కిశోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు బెండి గాంధీ, సీపాన మల్లేశ్వరరావు, పూజారి కాంతారావు, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఏఓ మెట్ట మోహనరావు, ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్, ఏపీఓ పి.లక్ష్మీనరసమ్మ, పంచాయతీ కార్యదర్శి దమయంతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు

సారవకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని ధర్మలక్ష్మీపురం సచివాలయ పరిధిలోని ధర్మలక్ష్మీపురం, పాతూరు, దాసుపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, సర్పంచ్ జన్ని అనిరుద్రుడు, కొండాల బాబూరావు, శంకరబాబు, సాగిపల్లి దండాశి, మాజీ సర్పంచ్ కాళ్ల సింహాచలం, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, పార్టీ నాయకులు నక్క తులసీదాస్, యాళ్ల శ్యామసుందరరావు, రావాడ శ్రీనివాసరావు, నక్క రాజు, లోకొండ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట..

మెళియాపుట్టి: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఇల్లాయిపురం గ్రామ సచివాలయం పరిధిలోని సున్నాపురం, గోవిందాపురం, ముత్యాలబొంతు, బరబొంతు గిరిజన గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గిరిజనుల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తుందని వివరించారు. ఇల్లాయిపురం గ్రామానికి చెందిన విద్యార్థిని లక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్ పాలన మునుపెన్నడూచూడని విధంగా ఉందని, అందరం సంతోషంగా ఉన్నామని, మళ్లీ మళ్లీ మాకు జగనన్నే ముఖ్యమంత్రి కావాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని సీఎం జగనన్నకు, ఎమ్మెల్యే రెడ్డిశాంతికి పలువురు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గూడ ఎండయ్య, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్, సర్పంచ్‌లు జమ్మయ్య, రామచంద్ర మజ్జి, ఉర్లాన రవి, పార్టీ నాయకులు నక్క బాబూరావు, వెంకటేష్, బెజ్జి పాపారావు, పెద్దింటి శ్రీనివాసరావు, ఎంపీడీఓ చంద్రకుమారి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: ఇల్లాయిపురంలో నవరత్నాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మాస్టార్లు వీరే..

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలువురిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా డీఈఓ సోమవారం ప్రకటించారు. వీరిని మంగళవారం జిల్లా కేంద్రంలో సత్కరించనున్నట్లు తెలిపారు.



పి.రేవతివల్లభరావు- హెచ్‌ఎం (జెడ్పీ హైస్కూల్ గంగువాడ, పాతపట్నం మండలం)



బి.కుమారస్వామి- హెచ్‌ఎం (మున్సిపల్ హైస్కూల్ చింతాడ, ఆమదాలవలస)



పి.శిరీష- ప్రిన్సిపాల్ (కేజీబీవీ స్కూల్ తాళ్లవలస, ఆమదాలవలస)



ఐ.సంతోష్‌కుమార్ - హిందీ స్కూల్ అసిస్టెంట్ (జెడ్పీహెచ్‌స్కూల్ సుందరపురం, నరసన్నపేట)



ఎం.జ్యోతిరాణి - వ్యాయామ ఉపాధ్యాయులు (జెడ్పీహెచ్‌స్కూల్ ఉర్లాం, నరసన్నపేట మండలం)



పైడి శ్యామలరావు- సెకెండరీ గ్రేడ్ టీచర్ (ఎంపీయూపీ స్కూల్ తాసెం, పొందూరు మండలం)



సీహెచ్ సురేష్‌బాబు - సెకెండరీ గ్రేడ్ టీచర్ (ఎంపీయూపీ స్కూల్ గులివిందలపేట, కొత్తూరు మండలం)



ఎస్.ధర్మారావు - సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ (ఎంపీయూపీ స్కూల్ బలద, కొత్తూరు మండలం)

బీజేపీవి ప్రజావ్యతిరేక విధానాలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి

ఆమదాలవలస: కేంద్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలను ఎన్నికల ముందు మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. ఆమదాలవలసలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ప్రజావ్యతిరేక విధానాలతో దేశం అల్లకల్లోలం అవుతుందన్నారు. నిత్యావసర వస్తువులు ధరలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయన్నారు. డీజిల్ పెట్రోల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని గుర్తుచేశారు. గ్యాస్ ధర సుమారుగా రూ.1200 పెంచి ప్రస్తుతం ఐదు రాష్ట్రాలు ఎన్నికలు ఉన్నందున కంటి తుడుపుగా రూ.200 తగ్గించి పేద, మధ్య తరగతి ప్రజలపై కపట ప్రేమ చూపిస్తుందన్నారు. దేశంలో దళితులపై దాడులు పెరిగాయన్నారు. మణిపూర్‌లో అల్లర్లను ఆపే ప్రయత్నం చేయకుండా కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయ కులు పాల్గొన్నారు.

పరామర్శ..



నరసన్నపేట: కన్నతల్లి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



ఎల్.ఎన్.పేట: సర్పంచ్ కృష్ణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

నరసన్నపేట: మండలంలోని ముషిడిగట్టు సర్పంచ్ దుల్ల కన్నతల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సోమవారం సాయంత్రం పరామర్శించారు. కన్నతల్లి భర్త దుల్ల రమణ, పిల్లలు రేవతి, రామకిరణ్‌లను ఓదార్చారు. ఉత్తమ సర్పంచ్‌గా కన్నతల్లి గుర్తింపు పొందారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, బొబ్బాది ఈశ్వరరావు, చింతల వెంకటరమణ ఉన్నారు.

అడ్డంగి సర్పంచ్ కుటుంబానికి..

ఎల్.ఎన్.పేట (కొత్తూరు): కొత్తూరు మండలంలోని అడ్డంగి గిరిజన పంచాయతీ సర్పంచ్ సవర కృష్ణ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మృతుని స్వగ్రామం దిగువ మల్లెలగూడ గ్రామానికి చేరుకుని సర్పంచ్ కృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. గిరిజన పంచాయతీ సర్పంచ్‌గా ఆయన పరిధిలోని గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం ఆలోచించే మంచి వ్యక్తి కోల్పోయామని ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఎలాంటి అవసరం ఉన్నా తన వద్దకు వచ్చి సమస్య తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని, తన వంతు సహాయం ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలని ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. అక్టోబర్ ఆఖరు నాటికి గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలన్నారు. నిర్మాణం పూర్తిచేసుకున్న స్థాయిల మేరకు బిల్లులు చెల్లించటం జరుగుతుందని గృహనిర్మాణ శాఖ ఏఈ కె.రమేష్ తెలిపారు. పనులు పూర్తిచేయటంలో నిర్లక్ష్యంగా ఉండే వారికి అవగాహన కల్పించాలన్నారు. స్థలం ఉండి ఇళ్లు కట్టుకుంటామని దరఖాస్తు చేసేవారికి కాలనీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అలాంటి వారి పేర్లు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ పత్రాలను గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

సంక్షిప్తంగా..

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఎల్.ఎన్.పేట: వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తే చర్యలు తప్పవని సరుబుజ్జిలి ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని యంబరాం కూడలి సమీపంలో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. మైనర్‌లకు వాహనాలు ఇస్తే అందుకు బాధ్యులైన కుటుంబ యజమానిపై కేసు నమోదు చేయటం జరుగుతుందన్నారు. పరిమితికి మించిన ప్రయాణికులతో వెళ్తున్న ఆటో యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మోటారు వాహన చట్టం ప్రకారం వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని అవగాహన కల్పించారు.

పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీపై ఆరా

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వే పూర్తి చేసుకున్న రెవెన్యూ గ్రామాల్లో రైతులకు వచ్చిన పట్టాదారు పాస్ పుస్తకాలను సకాలంలో పంపిణీ చేయాలని తహసీల్దార్ ఆర్.అప్పలరాజు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ, సర్వే సిబ్బందితో సమీక్ష చేపట్టారు. ఇప్పటివరకు రీసర్వే పూర్తిచేసుకున్న గ్రామాలు, ప్రస్తుతం రీసర్వే జరుగుతున్న గ్రామాలు, సరిహద్దు రాళ్లు పాతిన, ఇంకా పాతాల్సిన గ్రామాల వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటికే పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన, ఇంకా చేయాల్సిన రెవెన్యూ గ్రామాల కోసం ఆరా తీశారు. పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ పూర్తిచేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. ఉప తహసీల్దారు రషీద్ అహ్మద్ పాల్గొన్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తం

ఆమదాలవలస రూరల్: పశువులకు సక్రమించే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీఏ ఆర్.ఆనందరావు అన్నారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో గల రైతు భరోసా కేంద్రంలో సోమవారం పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పాడి, పంటతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించుకోవచ్చునని తెలిపారు. వర్షాకాలంలో పశువులకు పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నందున ముందస్తుగా టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, డిప్లొమా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అందలేదని ఫిర్యాదు

ఆమదాలవలస రూరల్: ఉపాధి హామీ సిబ్బంది తప్పుడు మస్తర్ల నమోదు చేయడం వల్ల తమకు వేతనాలు అందలేదని పలువురు వేతనదారులు ఫిర్యాదు చేశారు. మండలంలో దూసి గ్రామ పంచాయతీ పరిధిలో సోషల్ ఆడిట్‌లో భాగంగా గ్రామ సచివాలయంలో సోమవారం ఉపాధి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వేతనదారులు తమ సమస్యలను ఫిర్యాదు రూపంలో అందజేశారు. ఉపాధి పనులు వారానికి ఆరు రోజులు చేసినా మస్తర్లల్లో కేవలం నాలుగు, మూడు రోజుల నమోదు చేశారని వేతనదారులు తెలియజేశారు.ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. ఏపీఎం పి.లక్ష్మీనరసమ్మ, డీఆర్పీ లక్ష్మణస్వామి, వేతనదారులు పాల్గొన్నారు.

7, 8 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు

సరుబుజ్జిలి: ఈ నెల 7, 8వ తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంఈఓ డి.బాలరాజు సోమవారం ప్రకటనలో వెల్లడించారు. అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థులు వయస్సుకు సంబంధించిన ధ్రువపత్రాలు తప్పకుండా తీసుకురావాలన్నారు.

ప్రజల వద్దకే పాలన

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట (కొత్తూరు): గ్రామీణ ప్రాంత ప్రజల వద్దకు ప్రభుత్వ పరిపాలన తీసుకువచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కొత్తూరు మండలం మెట్టూరు బిట్-2 గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. పనుల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగాల్సిన పనిలేకుండా గ్రామ స్థాయికి తీసుకువచ్చారన్నారు. గ్రామ సచివాలయ పాలనలో భాగంగా రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్త్ కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు, ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేశారని గుర్తుచేశారు. ధ్రువ పత్రాలు మంజూరు కోసం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఊరిలోనే పొందేలా గ్రామ సచివాలయ పరిపాలన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు గెలవాలనే తపనతో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకుల తప్పుడు మాటలు విని మోసపావద్దన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పరితపించే సీఎం జగన్‌కు మరోసారి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ, పార్టీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, స్థానిక నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాలనకు పట్టుగొమ్మలు సచివాలయాలు

హిరమండలం: సచివాలయాలు పాలనకు పట్టుగొమ్మలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కొండరాగోలులో ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ప్రారంభించారు. సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత పల్లె ప్రజలకు కష్టాలు తీరాయని, సంక్షేమ పథకాలు, పౌరసేవలు మరింత మెరుగయ్యాయన్నారు. ఇదంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనతేనన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు సైతం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు యోచిస్తున్నాయని చెప్పారు. మరోసారి పాతపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, సర్పంచ్ ఎం.చిన్నయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు

- స్పీకర్ తమ్మినేని సీతారాం



ముద్దాడపేటలో తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో ముద్దాడపేట, ఫీర్‌సాహెబ్‌పేట గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.62 లక్షల వ్యయంతో నిర్మించిన తాగునీటి కుళాయిలను సోమవారం ప్రారంభించారు. కలివరం, తమ్మయ్యపేట గ్రామాల్లో రూ.1.31 కోట్ల వ్యయంతో నిర్మించనున్న తాగునీటి కుళాయిల కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఇంటింటి తాగునీటి కుళాయిల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదిక జరుగుతున్నాయన్నారు. రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, సర్పంచ్ టొంపల ఉమ, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సచివాలయాల మండల కో ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, పార్టీ నాయకులు తమ్మినేని వేణుగోపాలరావు, గురుగుబెల్లి గిరి, బండి రాజులు, పైడి మురళి, కంచరాపు రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.పి.సూర్యనారాయణ, జేఈ ఎం.చంద్రమౌళి, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న ధర్మాన పద్మప్రియ

జలుమూరు: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక పింఛన్లు ఎంతో ఆసరాగా ఉంటాయని వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ అన్నారు. మండలంలోని కరవంజ గ్రామానికి నూతనంగా మంజూరైన 33 పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. అర్హులైన వారందరికీ పార్టీలు చూడకుండా పలు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ధైర్యంగా చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, సర్పంచ్ జుత్తు నేతాజి, పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.